ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు
- కేకులు కట్ చేసి యేసు బోధనలు వినిపించిన పాస్టర్లు

జనగామలోని చర్చిలో యేసు బోధనలు వినిపిస్తున్న పాస్టర్

జనగామ రూరల్/ నర్మెట/బచ్చన్నపేట /రఘునాథపల్లి/ దేవరుప్పుల/తరిగొప్పుల/జఫర్‌గఢ్/,పాలకుర్తి/చిల్పూరు డిసెంబర్ 25 : క్రిస్మస్ వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జనగామ పట్టణంలోని చర్చిల్లో పాస్టర్లు కేకులు కట్ చేసి పంపిణీ చేశారు. ఓబుల్ కేశ్వాపూర్, ఎల్లంలలోని చర్చిల్లో పాస్టర్ సంజీవకుమార్, యశ్వంతాపూర్‌లోని షాలోమి బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పెద్దరాంచర్ల, పెంబర్తి, వడ్లకొండ, చీటాకోడూరు, చౌడారం, గానుగుపహాడ్, సిద్దెంకి, గోపరాజుపల్లి, పెద్దపహాడ్‌లోని చర్చిల్లో కేకులు కట్ చేసి పంపిణీ చేశారు. నర్మెట మండల కేంద్రంతోపాటు గుంటూరుపల్లి, ఆగాపేట గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి ప్రార్థనలు నిర్వహించి కేకులు కట్ చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నర్మెటకు చెందిన ఎనుగుల దయామణి వెలంగిణి దంపతులు క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని జనగామలోని శ్రీ రాజరాజేశ్వరి అనాథ వృద్ధాశ్రమంలో మహిళలకు చీరెలను పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రాజేశ్వరి, ఖాత పవన్‌కల్యాణ్, ప్రవీణ్, స్వీటి తదితరులు పాల్గొన్నారు. బచ్చన్నపేటలోని షాలేము మందిరంలో ఫాధర్ సాల్మన్‌రాజ్, సంఘ పెద్దలు ఆల్వాల జీవరత్నం, స్వామిదాసు నేతృత్వంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో లాజర్, ఆల్వాల రమేశ్, పైస రాజశేఖర్, నవీన్, గంధమల్ల జోసఫ్, మల్లేశ్, కిష్టయ్య, మోహన్, అన్వేష్, ఇస్తారి, భిక్షపతి, ప్రమోద్, పాల్ పాల్గొన్నారు. పోచన్నపేట, గోపాల్‌నగర్, ఇందిరానగర్, కట్కూర్ నుంచి వందలాదిగా క్రైస్తవులు తరలివచ్చారు. సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి, ఎంపీటీసీ నల్లగోని పుష్పబాలకిషన్‌గౌడ్, ఆల్వాల రాధ ఎల్లయ్య, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొండి వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు కోడూరి మహాత్మాచారి, గంధమల్ల నరేందర్ క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. రఘునాథపల్లి మండలం కోమల్ల చర్చిలో పాస్టర్ వెంకటస్వామి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు పేదలకు, సంఘం సభ్యులకు కానుకలు అందించి అన్నదానం చేశారు. లూర్థుమాత చర్చిలో ఫాదర్ గోపు థామస్‌రెడ్డి, గాదె మహేందర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, శౌరెడ్డి, స్పందన్, ఆనంద్, బొల్లపల్లి వెంకట్, మేకల అజయ్, కన్నారపు కుమారస్వామి పాల్గొన్నారు. దేవరుప్పుల మండలంలోని కడవెండి పురాతన తిరుకుటుంబం చర్చిలో ఫాదర్ జయరాజ్, ఆనంద్ యేసు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నీర్మాల, దేవరుప్పుల, చిన మడూరు, కోలుకొండ. రాంచంద్రాపురం గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. తరిగొప్పుల మండల కేంద్రంలోని చర్చిలో పాస్టర్లు కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అనంతరం యేసు బోధనలు వినిపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దామెర ప్రభుదాస్, వైస్ ఎంపీపీ చెన్నూరి ప్రమీల సంజీవ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి చిలివేరు లింగం, నాయకులు కొండం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. పాలకుర్తి లోని చర్చిల్లో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. నాయకులు భార్గవ్, రమేశ్, భాస్కర్, ఎల్లయ్య, శ్రీనివాస్‌రావు, వెంకన్న పాల్గొన్నారు. చిల్పూరు మండలం చిన్నపెండ్యాలలో క్రిస్మస్ వేడుకలను పాస్టర్లు సిమోన్, తిమోతి, నతానియోల్ నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఇల్లందుల సుదర్శన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఇల్లందుల హరిబాబు, ప్రభాకర్, అరుణ్, వెంకటేశ్ పాల్గొన్నారు. జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(ఐ)లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జడ్పీటీసీ ఇల్లందుల బేబి, వైస్ ఎంపీపీ కనకయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, సర్పంచ్ గాదెపాక అనిత, ఉప సర్పంచ్ కుమార్, సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

జనగామలోని ఉన్నపుర చర్చిలో క్రైస్తవులు

నర్మెటలోని అనాథాశ్రమంలో వృద్ధులకు చీరెలు పంపిణీ

బచ్చన్నపేట మండలం కట్కూర్‌లో..

చిన్నపెండ్యాల చర్చిలో క్రైస్తవులు

కోమల్ల చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

దేవరుప్పుల మండలం కడవెండి చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి శుభాకాంక్షలు

రఘునాథపల్లి, డిసెంబర్ 25: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని సీపీఐ మండల నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హనుమకొండలోని కడియం నివాసంలో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి కావటి యాదగిరి నేతృత్వంలో నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కావటి యాదగిరి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కడియం శ్రీహరిని కోరారు. దీనికి శ్రీహరి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొరిగె సోమయ్య, మనిగంటి సోమయ్య, ముప్పిడి ఎల్లయ్య, ఉడుగల జయమ్మ, శాడ ఎల్లయ్య, జనిగల అంజయ్య, చిట్యాల ఉప్పలయ్య, బాల్నే ఉదయ్, కమ్మాల వెంకన్న, బిర్రు నగేశ్ పాల్గొన్నారు.

ఆలేరు ఎమ్మెల్యేను కలిసిన కుర్మ సంఘం నేతలు

బచ్చన్నపేట,డిసెంబర్ 25 : అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను సోమవారం మండలంలోని కుర్మ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఐలయ్యకు అభినందనలు తెలిపి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జంగిలి స్వామి, భిక్షపతి, సాయి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి వేడుకలు

రఘునాథపల్లి, డిసెంబర్ 25: అయ్యప్పస్వామి వేడుకలను మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు బొల్లం అజయ్ నేతృత్వంలో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి వచ్చిన అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు.

సోమేశ్వరాలయంలో పూజలు

పాలకుర్తి, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని స్వయంభు సోమేశ్వర లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో సోమవారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, నిర్వహించారు. పక్కనే ఉన్న లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకున్నారు. సుబ్రహ్మణ్యస్వామి, చండికా అమ్మవారి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, డిసెంబర్ 25 : మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన మానుపాటి సోమమ్మ మృతి చెందగా, మృతురాలి కుటుంబానికి సామాజిక సేవా కార్యకర్త పోతుల రాములుయాదవ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా రాములుయాదవ్ మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కొక్కలకొండ బాబు, సత్యనారాయణ, నీల పాపాయ్య, సిద్దులు, నర్సింహులు, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి

బచ్చన్నపేట, డిసెంబర్ 25 : దివంగత మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను బీజేపీ నాయకులు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప మాట్లాడుతూ దేశంలో శాంతి, సౌభాగ్యం విరాజిల్లేలా బీజేపీ కృషి చేస్తున్నదన్నారు. మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, నాయకులు బల్ల శ్రీనివాస్, గణేశ్, వెంకట్‌రెడ్డి, నగేశ్, నరేందర్‌రెడ్డి, చంద్రమౌళి, రాంబాబు, భాస్కర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఠాణాలో ఆయుధాలను పరిశీలిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

ఠాణాలో రికార్డులను పరిశీలించిన ఏసీపీ

జనగామ రూరల్, డిసెంబర్ 25: జనగామ పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి సోమవారం సందర్శించి రికార్డులను, ఆయుధాలను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బంది వివరాలు, విధులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించి వివరాలు తెలుసుకోవాలన్నారు. ప్రతి పోలీసు అధికారి విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎలబోయిన శ్రీనివాస్ యాదవ్, ఎస్సైలు శ్వేత, అరుణ్, సృజన్, కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

రఘునాథపల్లి, డిసెంబర్ 25: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని భాంజీపేటలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భాంజీపేటకు చెందిన మాటూరి రమేశ్(54) సోమవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత సంఘం నాయకులు మొలుగురి యాకన్న, సట్ల బాలరాజు, గుల్లపల్లి వెంకటేశ్‌గౌడ్ కోరారు.

టిప్పర్ ఢీకొని యువకుడు..

చిల్పూరు,డిసెంబర్ 25 : మండలంలోని చిన్నపెండ్యాల వద్ద హైవేపై బైక్‌ను టిప్పర్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజవరం గ్రామానికి చెందిన కన్నబోయిన సందీప్(19) మరో వ్యక్తితో కలిసి సోమవారం బైక్‌పై వెళ్తుండగా చిన్నపెండ్యాల వద్ద హైవేపై టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. సందీప్ మృతికి కారణమైన టిప్పర్ యజమానిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

బాధిత కుటుంబానికి సేవాలాల్ ట్రస్ట్ సాయం

దేవరుప్పుల, డిసెంబర్ 25 : మండలంలోని చింతబాయి తండాలో కున్సోత్ మధుకర్ ఇంట్లో మూడు రోజుల క్రితం వంటగ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఈ నేపథ్యంలో సేవాలాల్ మహరాజ్ ధర్మ పరిరక్షణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యంతో పాటు, నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బానోత్ మహేందర్, గుగులోత్ వీరేశ్, భూక్యా శ్రీను, వెంకట్‌నాయక్, రాహూల్, నాగరాజు,సురేశ్, కున్సోత్ విజయ్, గుగులోత్ నర్సింహ, జాటోత్ రాము, స్థానిక సర్పంచ్ బానోత్ గేమానాయక్ పాల్గొన్నారు.

శాంతి, సామరస్యానికి ప్రతీక క్రిస్మస్

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 25 : శాంతి, సామరస్యంతోపాటు సేవకు నిదర్శనమే క్రిస్మస్ అని, ప్రజలకు జీవన విధానం నేర్పేదే క్రిస్టియానిటీ అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని పునిత నిర్మల మాత చర్చిలో ఫాదర్ అగస్టీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య దంపతులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ సంఘ పెద్దల ఆహ్వానం మేరకు మీ అందరినీ కలిసే అవకాశం లభించిందన్నారు. పవిత్రమైన ఈ చర్చిని అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా మార్చేందుకు, నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల దవాఖాన ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. యేసు ప్రభువు ఆశీస్సులు కడియంపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తాటికొండ సురేశ్‌కుమార్, గోవిందు ఆనందం, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మాచర్ల గణేశ్, రమేశ్ నాయక్, జయపాల్ రెడ్డి, సింగపురం నాగయ్య, సింగపురం యాదగిరి, తాటికొండ మధు, మారపల్లి ప్రసాద్, ఆకారపు అశోక్, యాదగిరి, చింత శ్రీను, జాకోబు, యాట అశోక్, వెంకటేశ్ నాయక్, అశోక్ రెడ్డి, రాజు, గాదె శ్రీను, జయపాల్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య

'ప్రజాపాలన'కు అధికారులు సిద్ధంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్, డిసెంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ఆరు గ్యారెంటీల అమలు కోసం ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమానికి అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్లు పర్మర్ పింకేశ్ కుమార్, సుహాసిని, వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు, వివిధ సమస్యలపై ప్రజలు అందించే దరఖాస్తులను స్వీకరించాలన్నారు. నియోజకవర్గం, మండలం, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలను నియమిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతుభరోసా పథకాల కోసం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడుతలుగా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రజలకు చేరువగా పాలన అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు దశల వారీగా సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు.

దరఖాస్తుదారుల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వారికి అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ఒకరోజు ముందు ప్రతి గ్రామం, వార్డులో దండోరా వేయించాలని ఆయన కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో అనిల్‌కుమార్, సీపీవో ఇస్మాయిల్, డీఆర్‌డీవో పీడీ మొగులప్ప, డీపీవో రంగాచారి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోలు మురళీకృష్ణ, రామ్మూర్తి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ప్రశాంత్, డీఎస్‌వో రోజారాణి, సంక్షేమ అధికారి జయంతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

రైతులకు లేగ దూడల పంపిణీ

దేవరుప్పుల, డిసెంబర్ 25: మండలంలోని లకావత్ తండా(తూర్పు) గ్రామపంచాయతీ పరిధిలో రాష్ట్ర గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు లేగదూడలను పంపిణీ చేశారు. 10 మంది రైతులకు 20 లేగ దూడలను ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుడికి ప్రీతిపాత్రమైన నందిని దృష్టిలో పెట్టుకుని వేములవాడ రాజన్న భక్తులు సమర్పించిన ఈ లేగదూడలను పేద రైతులకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. వీటిని రైతులు వ్యవసాయ అవసరాలకు వాడుకోవాలని, లేకుంటే వాపసు ఇవ్వొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గోశాల రాష్ట్ర అధ్యక్షుడు గాడిపల్లి రాజేశ్వర్‌రావు, గజ్జల రాధాకృష్ణ, స్థానిక సర్పంచ్ లకావత్ సత్తెమ్మ, నెహ్రూనాయక్, వార్డు సభ్యులు కాంతి, పరమేశ్వర నిర్వాహకులు లకావత్ అశోక్, భూక్యా పునీ పాల్గొన్నారు.

లకావత్ తండాలో రైతులకు గోవులు అందిస్తున్న మహేశ్ అగర్వాల్

- ఆధునిక పద్ధతుల్లో ఎరువుల వినియోగం
- ఎర్రగొల్లపహాడ్‌లో ఆదర్శంగా నిలిచిన రైతు

కూరగాయల సాగులో రారాజు

ఎర్రగొల్లపహాడ్‌లో కూరగాయలను తెంపుతున్న రైతు కుటుంబ సభ్యులు

జనగామ రూరల్, డిసెంబర్ 25: ఏళ్ల తరబడి ఒకే పంటను సాగు చేస్తే భూమి సారం దెబ్బతింటుంది. పంటలు పండే స్వభావాన్ని కోల్పోతుంది. ఎక్కువ మంది రైతులు ఏటా వరిని మాత్రమే సాగు వేస్తున్నారు. ప్రత్నామ్నాయ పంటలు సాగు చేస్తే లాభాలు పొందవచ్చని యువ రైతు రాజు దంపతులు అంటున్నారు. జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ గ్రామానికి చెందిన ఉప్పరి రాజు దంపతులు ఆరు సంవత్సరాలు ఎకరం మూడు గుంటల్లో వివిధ రకాల కూరగాయల సాగు చేస్తున్నారు. ఇక్కడ నీటిని ఇబ్బందులుండడంతో డ్రిప్ ఏర్పాటు చేశారు. కొద్దిపాటి నీటితో వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కూరగాయల సాగు చేస్తే బాగుంటుందనే ఆలోచనతో అడుగు పెట్టాడు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో లాభాలు వస్తాయని కూరగాయలు చేస్తున్నాడు. దంపతులిద్దరూ కలిసి కూరగాయలు పండిస్తున్నారు. ఉప్పరి రాజుకు వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల్లో రెండు ఎకరాల్లో వరి, ఎకరంలో కూరగాయల సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం చిక్కుడు, కాకర, టమాటా సాగు చేశాడు. మంచి దిగుబడి వస్తుండడంతో మార్కెట్‌తోపాటు సంతల్లోనూ విక్రయిస్తున్నాడు.

కాకరకాయలతో రాజు

కూరగాయలతో అధిక లాభాలు...

కరువు ప్రాంతం కావడంతో నీటికి కొంత ఇబ్బంది ఉంటుంది. ఉన్న నీటిని పొదుపు చేసి డ్రిప్ ద్వారా కూరగాయలు పండిస్తున్నాం. ఇక్కడ పంటలు పండించాలంటే వర్షాధారంపైనే ఆధారపడాలే. నీటి నీల్వలు తక్కువగా ఉండడంతో కూరగాయలు పండించాలనే ఆలోచనతో సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు కూరగాయల సాగులో లాభాలు వస్తున్నాయి. తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభాలు పొందవచ్చు. వరి కన్నా కూరగాయల సాగు చాలా బాగుంది.

కోడిపెంటతో ప్రయోజనం : రాజు, రైతు

కొందరు రైతులు కోడిపెంటతో అనేక కలుపుమొక్కలు వస్తాయని, దీంతో జీవం ఉంటుందని అంటారు. కానీ నేను చాలా రోజుల నుంచి కోడి పెంటను ఎరువుగా కూరగాయలకు వాడుతున్నా. కూరగాయల సాగు చాలా బాగుంది. అవసరమైతే సేంద్రియ ఎరువులను వేస్తున్నా. ప్రజల ఆరోగ్యం బాగుండాలనే ఉద్దేశంతో ఎరువుల వినియోగం నిషేధించాం. ఒకసారి వేసిన పంటను మార్చి మరో స్థలంలో వేయడంతో దిగుబడులు పెరిగాయి. దీంతో రైతులకు మంచి లాభాలు వస్తాయి.